01112024-DIS-04_Layout 1 12/1/2024 3:41 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

సంక్షోభంలో సంక్షేమ హాస్టళ్లు

డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్

ఉమ్మడి రాష్ట్రంలోని రెసిడెన్షియల్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో నేను 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుకున్నాను. అంతే కాదు, పీజీ నుంచి పీహెచ్‌డీ వరకు ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్లో చదువుకున్న. దీంతో హాస్టళ్ల పరిస్థితులను దగ్గరినుంచి చూసిన అనుభవం నాకున్నది. విద్యార్థి సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేసిన అనుభవం కూడా ఉన్నది. ఆ రోజుల్లో హాస్టళ్లలో దారుణమైన పరిస్థితులుండేవి. దొడ్డు బియ్యం, గొడ్డు కారంతో అన్నం తినేవాళ్లం. ఆ అన్నంలో ప్రతి రోజూ తెల్ల, లక్క పురుగులు కనిపించేవి. పచ్చి పులుసులో నల్లగా కనిపించేవి పోపుగింజలో, లక్కపురుగులో అర్థంకాక మేం తలలు పట్టుకునేవాళ్లం. ఓ రోజు నా మిత్రుడితో కలిసి అన్నం తింటున్న. అతను అన్నంలో ఒక్కో నల్ల గింజను ఏరడం మొదలు పెట్టాడు. 'ఏందిరా ఆవాలను ఏరి పారేస్తున్నావు' అని నేనడిగిన. 'అవి నీ ప్లేట్‌లోనూ ఉన్నయి, అవి ఆవాలు కాదు, లక్క పురుగులు, మంచిగ చూసి తిను' అని చెప్పిండు. ఆ రోజు నుంచి నేను కూడా తినే కంచంలో నల్ల పురుగులు, తెల్ల పురుగులను ఏరి పక్కన పడేసి అన్నం తినేవాడిని. ఇలాంటి దురదృష్టకర పరిస్థితులను ఎవరికి చెప్పుకోవాల్నో కూడా అర్థం కాక ఏడ్చిన సందర్భాలున్నయి. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమంలో టీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా ఉన్న నాకు, తెలంగాణ ఉద్యమ రథసారథి కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చింది. దీంతో విద్యార్థి సమస్యలపైన పోరాడిన.

2014 జూన్, 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక, తొలి శాసనసభ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో బీఆర్ఎస్ విద్యార్థి నాయకులందరం కలిసి తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్లాం. మా చర్చల్లో భాగంగా సంక్షేమ హాస్టళ్లలో పెట్టే భోజనం గురించి ప్రస్తావన వచ్చింది. అప్పుడే హాస్టళ్లలో చదువుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేద పిల్లలకు పౌష్టికాహారంతో కడుపు నిండా భోజనం పెట్టాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. తీసుకోవడమే కాదు, తక్షణమే అమలుచేశారు. దేశంలో మొట్టమొదటిసారిగా తెలంగాణలోని అన్ని హాస్టళ్లలోని విద్యార్థులకు సన్నబియ్యంతో కడుపు నిండా బువ్వ పెట్టిన ఘనత కేసీఆర్‌ది. హాస్టళ్లలో ఉండే విద్యార్థుల సమస్యలను కేసీఆర్ ఆషామాషీగా తీసుకోలేదు. భావి పౌరులు తయారయ్యేది విద్యాలయాల నుంచే గనుక వారికి మంచి భోజనం పెట్టాలని తరచూ చెప్పేవారు. అందులో భాగంగానే హాస్టళ్లలో ఉండే సమస్యలను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడే పరిష్కరించేవారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం కేసీఆర్‌కు ఒక ప్యాషన్ అయిపోయింది. కేజీ టు పీజీ విద్యాలయాల ఏర్పాటు కూడా అప్పుడే, ఆ సమయంలోనే కేసీఆర్ ఆలోచనల్లోంచి పుట్టింది . అంతేకాదు, గురుకుల పాఠశాలలు వెయ్యికి పైగా ఏర్పాటయ్యాయి. వీటన్నింటి ఫలితమే తెలంగాణలో విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరగడం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకులాలు దేశానికి ఆదర్శప్రాయంగా నిలిచాయి.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో నేను 2018లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నాను. ఆ సమయంలో సంక్షేమ హాస్టళ్లలో కేసీఆర్ ప్రభుత్వం పెట్టే భోజనం, గతంలో నేననుభవించిన హాస్టల్ కష్టాలు నా కండ్లముందు కదలాడాయి. కేసీఆర్ హాస్టళ్లలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తుంటే విద్యార్థులపై ఉన్న ప్రేమతో ఆయన ఈ పనిచేస్తున్నారనే విషయం నాకర్థమైంది. అందుకే పదేండ్ల కేసీఆర్ పాలనలో 'గురుకులాల్లో సీటు దొరికితే బాగుండు' అని తల్లిదండ్రులు తాపత్రయపడ్డారు. కమిషన్ చైర్మన్‌గా ఉన్న మూడేండ్ల సమయంలో నేను దాదాపు 750 మంది ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు కమిషన్ చొరవతో, ఆనాటి గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు సిఫారసు చేసి గురుకులాల్లో సీట్లు ఇప్పించగలిగాను. వారిప్పుడు ఉన్నత చదువులను అభ్యసిస్తున్నారు. నాకెంతో సంతృప్తిని కలిగించిన పనులివి.

> నాడు రాష్ట్రంలోని గురుకులాలు అగ్రస్థాయిలో ఉంటే, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలు అధమస్థాయిలో ఉన్నాయి. గురుకులాల్లో సీటు దొరికితే చాలు అనే స్థితి నుంచి పిలిచి సీటిచ్చినా తీసుకోని పరిస్థితి దాపురించింది. విద్యార్థులకు పాఠాల సంగతి దేవుడెరుగు.. మా బిడ్డల ప్రాణాలు బాగుంటే చాలునని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రం లో రూ.62 వేల కోట్ల బడ్జెట్‌ను తెలంగాణ తొలి ప్రభుత్వం రూ.3 లక్షల కోట్లకు పెంచింది. అయి నా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టలేకపోతున్నది. ఏడాది కాలంలోనే సంక్షేమ హాస్టళ్లలోని స్థితి గతులు ఇలా దిగజారి పోతే, భవిష్యత్తు కాలంలో వాటి పరిస్థితిని ఊహించుకుంటేనే ఒళ్లు జలదరిస్తున్నది.

కేసీఆర్ హయాంలో గురుకులాల్లో చదివే విద్యార్థుల చికిత్స కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించేది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులు అనారోగ్యానికి గురైనా పట్టించుకోడం లేదు. పైగా 'ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లండి, ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయించుకోండి' అని ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచినట్టు ప్రచారం చేసుకుంటున్నది. కానీ, వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చలికాలం వస్తే చాలు విద్యార్థుల కోసం స్లీప్ మ్యాట్స్, రగ్గులు పంపిణీ చేసేది. అంతేకాదు, వారానికో సారి చికెన్, నెలలో ఒకసారి మటన్‌తో భోజనం పెట్టేది. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రగ్గులేమో కానీ, గుడ్లు కూడా సరిగా పెట్టడం లేదు. ప్రస్తుతం సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ఒకే చోట మూడుసార్లు ఫుడ్ పాయిజన్ జరగడం విడ్డూరం. అందుకే విద్యార్థుల మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్పష్టంగా అర్థమవుతున్నది. బీఆర్ఎస్ హయాంలో విద్యార్థుల ఆత్మహత్యల నివారణ కోసం కౌన్సిలర్లు ఉండేవారు. ఇపుడు వారు ఎక్కడికివెళ్లారో తెలియడం లేదు. ఇదిలా ఉంటే భువనగిరి హాస్టల్లో ఇద్దరు విద్యార్థినులపై అత్యాచారం జరగడం బాధాకరం. అంతటి విషాదం జరిగినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా అనిపించడం లేదు. అందుకేనేమో రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించడం లేదు. రాష్ట్రంలో ఇప్పుడు విద్యార్థు బాగోగులను చూసుకునే విద్యాశాఖ మంత్రి లేడు. శాంతిభద్రతలను కాపాడే హోంశాఖ మంత్రి లేడు. రాష్ట్రంలో అసలు ఏం జరుగుతున్నదో అర్థం కాని పరిస్థితి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి 28 సార్లు వెళ్లేందుకు సమయం ఉంటుంది కానీ, విద్యార్థులు చనిపోతే మాత్రం వెళ్లి పరామర్శించే సమయం లేదా?

విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలనే ఆలోచనతోనే గత ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను అద్భుతంగా తీర్చిదిద్దింది. ఆ లక్ష్యా నికి కాంగ్రెస్ ప్రభుత్వం గండి కొడుతున్నది. నాడు రా ష్ట్రంలో విద్యా ప్రమాణాలు కూడా పెరిగితే, నేడు క్షీణి స్తు న్నాయి. ఉమ్మడి పాలనలో కనీస వసతులు లేక సంక్షేమ హాస్టళ్లు సమస్యలతో కొట్టుమిట్టాడాయి. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థలన్నీ పురోగతి సాధిస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి ఏపీ నాటి స్థితికే చేరుకుంటున్నాయి. గత బీఆర్ఎస్ ఎలక్ట్రిసిటీ, మరుగు దొడ్లు, డ్రైనేజీ, వాటర్ పైప్‌లైన్లు తదితర పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసింది. విద్యార్థులకు యూనిఫార్మ్స్, బ్యాగులు, పుస్తకాలు అందించడంతో పాటు డైట్ ఛార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించింది. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సంక్షేమ హాస్టళ్లలో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటుచేసింది. ప్రతి రోజూ ప్రత్యేక పర్యవేక్షణతో విద్యార్థులకు రక్షణ కల్పించింది. ఇలాంటి చర్యలు కూడా తెలంగాణ హాస్టళ్లలో విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరగడానికి కారణమయ్యాయి. మన గురుకుల పాఠశాలలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి సుమారు ఏడాది కావొస్తున్నది. అంతే, సంక్షేమ హాస్టళ్లు, సంక్షోభ హాస్టళ్లుగా మారాయి. సమస్యలకు ప్రధాన కేంద్రాలయ్యాయి. గురుకులాలు అరకొర వసతులతో దౌర్భాగ్య స్థితిలో ఉన్నాయి. వాటిలో పరిశుభ్రత లోపించింది. చెత్త, చెదారంతో నిండి కంపు కొడుతున్నాయి. పాఠశాల నుంచి కళాశాల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ.. ఏ హాస్టల్ చూసినా ఇలాంటి దుర్భర పరిస్థితులే ఉన్నాయి. వీటిన్నింటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణం. అంతేకాదు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులు కుక్క, పాము, ఎలుక కాట్లతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇక ఫుడ్ పాయిజన్ కేసులైతే షరామామూలయ్యాయి. కేసీఆర్ పదేండ్ల పాలనా కాలంలో గురుకుల విద్యార్థులు ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించారు. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం గురుకుల విద్యార్థులు దవాఖానల పాలవుతున్నారు. గురుకుల విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుండటం నిజంగా విషాదం.

ఈ ఏడాది కాంగ్రెస్ పాలనలో 916 మంది విద్యార్థులు ఆస్పత్రుల్లో షరీఖ్ కావడం దారుణం. అందులో 49 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం విషాదం. ఈ మరణాలను పరిశీలిస్తే... ఇందులో 24 మంది విద్యార్థులు మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలు చేసుకోగా, 8 మంది విద్యార్థులు అనుమానాస్పద స్థితిలో మరణించారు. హాస్టళ్లలో అపరిశుభ్ర వాతావరణం కారణంగా 13 మంది విద్యార్థులు అనారోగ్యంపాలై మరణించారు. మరో నలుగురు విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కారణంగా మరణించారు.

ఇక సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు చెప్పనలవికానివి. నెలలకొద్దీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. నెల నెలా ఒక్కో విద్యార్థికి రావాల్సిన కాస్మొటిక్ చార్జీలు, పాకెట్ మనీ రావడం లేదు. పాఠశాల, కళాశాల హాస్టళ్లకు సంబంధించిన డైట్ చార్జీలూ బకాయి పడ్డాయి. విద్యార్థులకు యూనిఫార్మ్స్ సరి గా అందడం లేదు. స్కావెంజర్ల నియామకం జరగ టం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే విద్యావ్యవస్థల్లో ని సమస్యలు కోకొల్లలు. అందుకే కాంగ్రెస్ ఏడాది పాలనలో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది. విద్యార్థులు రోడ్డెక్కుతున్నారు.

> సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రచారం కోసం నానా యాగీ చేశారు. ట్రాక్టర్‌లో వెళ్లి, కళాశాలల గోడ దూకడం లాంటి వికృత చేష్టలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ట్రిపుల్ ఐటీ సమస్యలు పరిష్కరిస్తామని, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తామని ప్రగల్భాలు పలికారు. కానీ, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తన భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకున్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు.

ఈ ఏడాది కాంగ్రెస్ పాలనలో ధ్వంసం కాని వ్యవస్థ రాష్ట్రంలో లేదంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి విద్యాశాఖ సమస్యలతోపాటు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన తక్షణ అవసరం ఎంతైనా ఉన్నది.

(వ్యాసకర్త: మాజీ చైర్మన్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్)

> తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్ల పాలనా కాలంలో గురుకుల విద్యార్థులు ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనా కాలంలో గురుకుల విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇదెంత దారుణం?

గ్యారెంటీలకు మహా గండి

> గ్యారెంటీల మాయాజాలంతో వరుసగా హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారంలోకి కాంగ్రెస్ వచ్చిన విషయం తెలిసిందే. అయితే ప్రకటించిన గ్యారెంటీలు వికటించి హర్యానా, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది. కొందరిని ఎల్లకాలం మోసం చేయవచ్చు. అందరిని కొంతకాలం మోసం చేయవచ్చు. కానీ అందరినీ అన్ని కాలాలు మోసం చేయలేరని మరోసారి రుజువైంది. హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీల వైఫల్యం సరిహద్దు రాష్ట్రమైన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి దారితీయగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో గ్యారెంటీల వైఫల్యం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభావం చూపింది. దేశ రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రధాన భూమిక పోషించే రాష్ట్రం దక్కినట్టే దక్కి 'చేయి'జారిపోయింది. కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ ఆఘాడి ఘోర పరాజయానికి, బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ఘన విజయానికి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల వాగ్దాన వైఫల్యాలు ప్రధాన కారణమయ్యాయి.

డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238

2022, డిసెంబర్‌లో జరిగిన హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పది గ్యారెంటీలు ప్రకటించి అధికారంలోకి వచ్చింది. అదే క్రమంలో 2023 మే నెలలో కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు గ్యారెంటీలు ఇచ్చి, అదే ఏడాది నవంబర్‌లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 6 గ్యారెంటీలు ప్రకటించి కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని కైవసం చేసుకున్నది. ఏడాది తిరగక ముందే ఈ మూడు రాష్ట్రాల ప్రజలు దారుణంగా మోసపోయామనే అభిప్రాయానికి వచ్చారు. గ్యారెంటీల వైఫల్యం సరిహద్దు రాష్ట్రాలకు పాకింది. ఫలితంగా ఎన్నో ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్‌కు చేదనుభవం ఎదురైంది. ప్రత్యేకించి మహారాష్ట్ర చరిత్రలో కనీ వినీ ఎరుగని పరాజయాన్ని మూటగట్టుకున్నది. మహారాష్ట్రలో మహా వికాస్ ఆఘాడి ప్రకటించిన ఐదు గ్యారెంటీలను ప్రజలు నమ్మలేదు. పొరుగున ఉన్న కాంగ్రెస్ పాలిత తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాల గ్యారెంటీల వైఫల్యాల నేపథ్యంలో మహారాష్ట్ర ఓటర్లు మహా వికాస్ ఆఘాడిని తిరస్కరించారు. కాంగ్రెస్‌తో కలిసి నడిచిన పాపానికి ఆఘాడి భాగస్వామ్య పక్షాలు శివసేన (ఉద్ధవ్‌థాక్రే) ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీలకూ భంగపాటు తప్పలేదు.

గత లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలోని 48 స్థానాల్లో 30 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ నాయకత్వంలోని మహా వికాస్ ఆఘాడి 4 నెలలకే చతికిల పడిపోయింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పునరావృతమై అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఘన విజయం సాధిస్తామనుకున్న ఆఘాడి కూటమి అగాధంలోకి జారిపోయింది. మహిళలకు నెలకు రూ.3 వేలు, ఉచిత బస్సు, నిరుద్యోగులకు నెలకు వేలు, 50 శాతం రిజర్వేషన్ల పరిమితి తొలగింపు, రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా వంటి ప్రజాకర్షక గ్యారెంటీలు ప్రకటించినా తెలంగాణ, కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల మహారాష్ట్ర ప్రజలు వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. ప్రత్యేకించి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులలో నివసించే మహారాష్ట్ర ప్రజలు మహా వికాస్ ఆఘాడిని ఊడ్చిపారేశారు. లోక్‌సభ ఎన్నికల్లో నెత్తిన పెట్టుకున్న వాళ్లే అసెంబ్లీ ఎన్నికలకు వచ్చేసరికి నెలకేసి కొట్టారు. కాంగ్రెస్ గ్యారెంటీల గప్పాలకు వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పు అది.

కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో గ్యారెంటీల పేరుతో ప్రజలను దారుణంగా వంచించిన కాంగ్రెస్ పక్కనే ఉన్న మహారాష్ట్రలో అవే గ్యారెంటీల మాయోపాయాలతో అధికారంలోకి రావాలని నేలవిడిచి సాముచేసింది. ఎందుకంటే ఈ మూడు రాష్ట్రాల మధ్య వేయి కిలోమీటర్ల పైగా సరిహద్దులున్నాయి. కళ్యాణ కర్ణాటక, మరాఠ్వాడ, తెలంగాణ ప్రాంతాలు భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడేంతవరకు ఒక రాష్ట్రంగా ఉన్నవే. ఈ ప్రాంతాల మధ్య బంధుత్వాలు వ్యాపార లావాదేవీలు నిరంతరంగా కొనసాగుతూనే ఉన్నాయి. సాంస్కృతిక ఆచార వ్యవహారాల ఆదాన ప్రదానాలున్నాయి. పైగా, తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల ప్రజలకు మరాఠీ తెలిసినట్టే అవతలి గట్టున ఉన్న మహారాష్ట్ర ప్రజలకు తెలుగు, కన్నడ భాషలు తెలుసు. ఈ నేపథ్యంలో తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాల గ్యారెంటీ గ్యాంబ్లింగ్‌ను సరిహద్దు మహారాష్ట్ర ప్రజలు గ్రహించడానికి ఎక్కువ సమయం పట్ట లేదు. అందుకే కీలెరిగి వాత పెట్టారు.

మహారాష్ట్రలోని గడ్చిరోలి, చంద్రపూర్, యావత్‌మాల్, నాందేడ్ జిల్లాలు తెలంగాణ సరిహద్దుల్లో, సాంగ్లీ, సోలాపూర్, కొల్హాపూర్, జిల్లాలు కర్ణాటక సరిహద్దుల్లో ఉన్నాయి. గడ్చిరోలి, చంద్రపూర్, హింగోలి, నాందేడ్, ఉస్మానాబాద్, లాతూర్, సోలాపూర్, సాంగ్లీ, హట్కానంగి, కొల్హాపూర్, రత్నగిరి లోక్‌సభ నియోజకవర్గాలు అదే పరిధిలో ఉన్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో ఉస్మానాబాద్ రత్నగిరి మహాయుతి గెలుచుకోగా ఎనిమిది లోక్‌సభ స్థానాల్లో మహా వికాస్ ఆఘాడి విజయం సాధించింది. హట్కానంగే లోక్‌సభ స్థానంలో విజయం సాధించిన ఇండిపెండెంట్ అభ్యర్థి ఆఘాడి సరసన చేరడంతో మొత్తంగా 11 స్థానాల్లో 9 ఆ కూటమి ఖాతాలో చేరాయి. కానీ, 4 నెలలకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరిస్థితి తారుమారైంది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు ఆనుకొని ఉన్న 26 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ ఆఘాడి గెల్చుకున్న నియోజకవర్గాలు మూడు మాత్రమే. తెలంగాణ పొరుగున ఉన్న గడ్చిరోలి, అహిరి, రాజూరా, ఆర్మీ, కిన్వట్, హడ్గావ్, బోకర్, నాయీ గావ్, దేగ్లూర్ మహాయుతి గెలుచుకోగా మహా వికాస్ అఘాడి కేవలం ఒక్క 'వానీ' నియోజకవర్గానికి పరిమితమైంది. కర్ణాటక సరిహద్దుల్లోని ముధ్దేడ్ ఉద్గిర్, నీలంగా, అవుసా, అక్కల్‌కోట్, సోలాపూర్, పండర్‌పూర్, జాట్‌మిరాజ్, కొల్హాపూర్, కాగల్, చండ్‌గడ్, సావంత్‌వాడి, అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహాయుతి విజయం సాధించగా ఉమర్గా, తస్‌గావ్ నియోజకవర్గాల్లో మాత్రమే మహా వికాస్ ఆఘాడి విజయం సాధించింది. మొత్తంగా తెలంగాణ సరిహద్దుల్లోని నాలుగు జిల్లాలు, కర్ణాటక సరిహద్దుల్లోని మూడు జిల్లాల్లో కలిపి 54 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ ఆఘాడి గెలిచింది 15 మాత్రమే. ఈ లెక్కన కాంగ్రెస్ గ్యారెంటీ మోసాలు మహారాష్ట్ర ఫలితాలను తారుమారు చేశాయన్నది తేటతెల్లమైంది. కాంగ్రెస్‌ను నమ్మి దరిచేరిన దిగ్గజ నేతలు శరద్‌పవార్, ఉద్ధవ్ థాక్రేలకు సహవాస దోషం ఫలితంగా పరాభవం ఎదురైంది. ఎవరికీ కనీసం ప్రతిపక్ష హోదా దక్కని దుస్థితి ఏర్పడింది.

'బేగాని షాదీ మే అబ్దుల్లా దీవానా' అన్నట్టు సొంత రాష్ట్రాలలో గ్యారెంటీలను గంగలో కలిపిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, వారి మంత్రి బృందాలు, నాయకశ్రేణులు మహారాష్ట్రలో ప్రచారం చేయడం, తమ రాష్ట్రాల్లో గ్యారెంటీలను పూర్తిగా అమలుపరచామని పచ్చి అబద్ధాలాడటం సరిహద్దు నియోజకవర్గాల్లో మహా వికాస్ ఆఘాడి విజయావకాశాలను తీవ్రంగా దెబ్బతీశాయి. అవి మోసపూరిత ప్రసంగాలని అక్కడి ప్రజలు గ్రహించారు. తెలంగాణ మూలాలున్న ప్రజలు నిర్ణాయక శక్తులుగా ఉన్న 8 నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం చేసినా తుదకు దక్కినవి రెండే రెండు. సిద్ధరామయ్య పరిస్థితి అంతే. ఏదేమైనా మొన్న హర్యానా, నిన్న మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ పరివారం గెలుపు తలుపు ముందు బొక్క బోర్లా పడటానికి గల కారణాల్లో అంతకుముందు కొలువుదీరిన మూడు కాంగ్రెస్ ప్రభుత్వాల గ్యారెంటీల వైఫల్యాలు ముందు నిలిచాయి.

సాగు సడుగులు ఇరిగిపాయె!

> మన దేశంలో ఎక్కువమంది ప్రజలు వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అందుకే, రైతులు బాగుంటే అందరూ బాగున్నట్టేనని పరిగణిస్తాం. పారిశ్రామిక అభివృద్ధి కూడా సాగు పురోగతిపైనే ఆధారపడి ఉంటుంది. ఎన్నికల జయాపజయాలు గ్రామీణ ఓటర్ల చుట్టే తిరుగుతాయి. రైతు సంక్షేమం, పంట దిగుబడి, మద్దతు ధర మొదలైన అంశాలపై చిత్తశుద్ధి గల నాయకులు దృష్టిపెట్టి దిగుబడి ఎక్కువగా రావాలని కోరుకుంటారు. అందుకోసం నేతలకు వ్యవసాయంలోని లోటుపాట్లు తెలిసి ఉండాలి. స్వయంగా రైతు అయిన కేసీఆర్‌కు రైతు కష్టాలు, సమస్యలు క్షుణ్ణంగా తెలుసు. అందుకే తన హయాంలో రైతు సమస్యలు పరిష్కరించగలిగారు. పదేండ్ల పాలనలో రైతాంగానికి కేసీఆర్ ఎన్నో ప్రత్యేక సదుపాయాలు కల్పించి తెలంగాణ సస్యతను వృద్ధి చేశారు.

నర్సన్ బద్రి
94401 28169

ఏవో కథలు చెప్పి గ్రామీణ ఓట్లను కొల్లగొట్టే వారితోనే వ్యవసాయ రంగానికి తీరని నష్టం వస్తున్నది. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని నేనూ రైతునే అని చెప్పి, కొత్త ఆశలను రేకెత్తించి రేవంత్‌రెడ్డి తెలంగాణకు ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన ఏడాది పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురై మొదట మోసపోయినవారు రైతులే. రైతు శ్రేయోభిలాషి కేసీఆర్‌కు, రేవంత్‌కు ఎలాంటి పోలిక లేదు. ప్రస్తుతం అన్ని పార్టీల లీడర్లలో సాగు జ్ఞానం ఉన్నవారు కేసీఆర్ తర్వాత ఒక్కరు కూడా కానరారు. అందుకే, ఈ ఇద్దరి పాలనలను పోల్చిచూస్తే సాగు రంగానికి కలిగిన మేలు రీత్యా చెప్పరాని అంతరం ఉన్నది. కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు పథకాలనే పేరు మార్చి, సొమ్ము పెంచి హైజాక్ చేశారు కాంగ్రెస్ పెద్దలు. చివరికి 'ఉండబట్టలేక ఓటేస్తే ఉన్న బట్ట ఊడిపోయింది' అన్నట్టు కేసీఆర్ హయాంలో అందిన సాయం కూడా రైతులకు దక్కకుండా పోయింది.

2018, కేసీఆర్ పాలనలో మొదలైన రైతుబంధు 11వ విడతగా 2023, 26 జూన్ నాడు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,790 కోట్లు జమయ్యాయి. డిసెంబర్‌లో కాంగ్రెస్ పాలన మొదలైంది. ఇప్పటివరకు మూడు పంటలకు అందవలసిన బంధు సాయం ఆగిపోయింది. రైతుభరోసా ఒక్క సీజన్ ఎగ్గొడితే సుమారు రూ.8 వేల కోట్ల రైతుల సొమ్మును కొట్టేసినట్టే. అర్హులైన రైతుల లెక్క నెలరోజుల్లో తీస్తామని రేవంత్‌రెడ్డి చెప్పి పదకొండు నెలలవుతున్నది.

జనవరిలో నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో రైతుభరోసాపై సీఎం రేవంత్‌రెడ్డి కొత్త విధి విధానాలు ఉంటాయన్నారు. కొత్త మార్గదర్శకాలతో వాసకాలపు పంట నుంచి రైతులకు పెట్టుబడి సాయం అందుతుందన్నారు. జ